క్లుప్తంగా

విద్యాకానుక కిట్ల పంపిణీ



ఎంపీయూపీ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

ద్వారకాతిరుమల : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత అన్నారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు తదితరులతో కలసి ఆమె బుధవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం, దూలపల్లి ప్రసాద్, అచ్యుత ఏసుబాబు తదితరులున్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



ద్విచక్రవాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం : వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెం బోసుబొమ్మ సెంటర్‌లో బుధవారం ట్రాఫిక్ పోలీసులతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేని వాహనదారులను గుర్తించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ధారణ అనేది ఒక అలవాటుగా చేసుకోవాలని ద్విచక్ర వాహనదారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సై పి.రామకృష్ణ, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం పోరు కేక పాదయాత్ర



నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పాదయాత్ర ప్రారంభించిన సీపీఎం నాయకులు

పోలవరం రూరల్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇళ్లు, భూములు సర్వం త్యాగం చేసిన నిర్వాసితులు త్యాగమూర్తులని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పోలవరం నుంచి విజయవాడ వరకు జరుగుతున్న పోలవరం నిర్వాసితుల పోరు కేక ఉప పాదయాత్రను బుధవారం పోలవరం ఏటిగట్టు సెంటర్ నుంచి ప్రారంభించారు. వై.వెంకటేశ్వరరావు ఈ పాదయాత్రను ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని, భూమికి భూమి ఇవ్వాలని, ఉపాధి కల్పించాలన్నారు. సీపీఎం నాయకులు గుడెల్లి వెంకట్రావు, టి.ముత్యాలమ్మ, బి.భూచంద్రరావు, ఎస్. సాయికృష్ణ, ఎం.గంగాదేవి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళ అదృశ్యంపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మైసన్నగూడెంకు చెందిన దమ్మశెల్లి మంగకు 16 సంవత్సరాల క్రితం శ్రీనివాసపురానికి చెందిన దమ్మిశెల్లి నాగేశ్వరరావుతో వివాహమైంది. వీరికి ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. భార్య భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో మంగ ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో వీరి సమస్యను పెద్దల సమక్షంలో ఉంచగా, పెద్దల సూచన మేరకు తల్లి ఉండ్రాజవరపు లక్ష్మి ఇంటికి తీసుకువెళ్లింది. ఈ నెల 19వ తేదీన మంగ ఇంటి నుంచి వెళ్లిపోగా, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఆమె తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అవినీతికి తావులేకుండా సంక్షేమ లబ్ధి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : అవినీతికి తావులేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని రాచన్నగూడెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బాలరాజు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గడిచిన నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను గడపగడపకూ తిరిగి ప్రజలకు అందజేశారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుందర్ సింగ్, ఎంపీడీఓ కేవీఎస్ కృష్ణప్రసాద్, ఎస్సై వి.చంద్రశేఖర్, ఎంపీపీ కోర్స పోసమ్మ, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను, సర్పంచ్ సున్నరలక్ష్మీ, ఎంపీటీసీ సున్న సురేష్ , జేసీఎస్ కన్వీనర్ వనమా రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు కొల్లూరి రాంబాబు, బోదా శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు చందా ప్రసాద్, చిట్టిబొమ్మ శ్రీను, కె.రాఘవరెడ్డి, కక్కిరాల చక్రి, కక్కిరాల రాము, బూరుగు ప్రేమ్‌కుమార్, వీరంకి వెంకటేశ్వరరావు, సింగలదేవి సత్యనారాయణ, అమీర్ వల్లీ, కుంజా రాముడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం : రాచన్నగూడెంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



లింగపాలెం : ధర్మాజీగూడెంలో బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి

లింగపాలెం : రాష్ట్రంలోనే కాదు దేశ చరిత్రలోనే ఏ ప్రభుత్వం అమలు చేయలేని విధంగా ఇంటింటికీ వివిధ పథకాల ద్వారా సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం సచివాలయంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా, సర్పంచ్ కొత్తూరి మానిక, సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటివరప్రసాద్ నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలను ఆయనకు వివరించగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పథకాలు నేరుగా ప్రజలకు అందిస్తుండడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వలేక పచ్చమీడియాను అడ్డం పెట్టుకుని టీడీపీ దుష్ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. ప్రజలు టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలు వినే ప్రసక్తే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మేకల రాజ్యలక్ష్మి, ధర్మాజీగూడెం గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ అధ్యక్షులు మేకల రాజు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తాడేపల్లి శాంతరావు, మోరంపూడి జగన్, కొత్తూరి రమేష్, నూతలపాటి శ్రీను, గారపాటి రాంబాబు, కె ఆనంద్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ధర్మాజీగూడెంలో...

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ధర్మాజీగూడెం గ్రామంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొవాలని ఆయన కోరారు.

లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్‌గా పంతగాని వెంకన్న



పంతగాని వెంకన్న

జంగారెడ్డిగూడెం : లయన్స్ క్లబ్ యూత్ క్యాంప్స్ జిల్లా చైర్‌పర్సన్‌గా పంతగాని వెంకన్న నియమితులయ్యారు. జూలై 1వ తేదీ నుంచి ఏడాది కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని లయన్స్ క్లబ్‌ల ద్వారా యూత్ యాక్టివిటీస్ చేపట్టేందుకుగాను ఆయనను ఈ పదవిలో నియమించారు. వెంకన్న ప్రస్తుతం లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పంతగాని వెంకన్న మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లా గవర్నర్ మాణిక్యాలరావు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్నను పలువురు అభినందించారు.

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబానికి రూ.10 వేల చెక్కును అందిస్తున్న రావు వినోద్

కుక్కునూరు : మండల కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న దుక్కిపాటి బాలాజీ (30)ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా అతనికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా మంజూరైన రూ.10 వేలు బుధవారం మృతుడి భార్య నీలవేణికి వైఎస్సార్‌సీపీ నాయకుడు రావు వినోద్ అందించారు. అంతేకాక త్వరలోనే రూ.90 వేలు మృతుడి నామినీ ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుందని చెప్పారు. వెల్ఫేర్ అసిస్టెంట్ అప్సర్‌పాషా, వలంటీర్ మచ్చా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

41.15 కాంటూర్ పరిధిలో కలపాలని వినతి



ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న చెరువుకొమ్ముగూడెం గ్రామస్తులు

కుక్కునూరు : అమరవరం పంచాయతీ చెరువుకొమ్ముగూడెం గ్రామాన్ని పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో చేర్చి పరిహారం అందించాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది గోదావరి వరదతో చెరువుకొమ్ముగూడెం గ్రామం ముంపునకు గురవుతుందని, కాని తమ గ్రామాన్ని 45 కాంటూర్ పరిధిలో చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ గ్రామాన్ని మొదటి కాంటూర్ పరిధిలో చేర్చి ఆర్అండ్ఆర్ పరిహారాన్ని అందించాలని కోరారు.

నేడు శయన ఏకాదశి

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరిలో శయన ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ గురువారం తొలి ఏకాదశి (శయన ఏకాదశి) సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలతో పాటు ప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

జగన్‌తోనే ప్రతి ఇంటికీ సంక్షేమ కాంతులు

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్ అన్నారు. బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కొండగూడెం, కొత్తూరు గ్రామాలలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. కొండగూడెం కాలనీలో కామా జయరాజు, అర్హుడైన నాకు వృద్ధాప్య పింఛన్ రావటం లేదని నాకు ఇప్పించాలని, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురాగా త్వరలో సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తామని అన్నారు. గ్రామంలోని పలువురు కుల ధ్రువీకరణ పత్రం, పొలం అడంగల్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల టౌన్ కన్వీనర్ నానాది సాగర్, మండల సచివాలయాల కన్వీనర్ పండు ప్రసన్న, మోహన్, చింతపల్లి సుధా, అందుగుల జాన్, కొత్తూరు సచివాలయ సెక్రటరీ మనోజ్, వలంటీర్ నాంచారి, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం రూరల్ : పట్టెన్నపాలెంలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న దృశ్యం



కామవరపుకోట : కొండగూడెం గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది



కొయ్యలగూడెం : జగనన్న సురక్ష సర్వీస్ అంశాల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని వేగవరం సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్లను అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అర్హత కలిగి ఉండి పథకాలను రాకుండా ఉన్న వారిని గుర్తించి వారికి పథకాలను అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు నులకాని సూర్యచంద్రరావు, ఎంఎల్‌వో పి. రాజా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టెన్నపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, ఎంపీటీసీ రామిశెట్టి రాజు, సచివాలయ కన్వీనర్ పసుపులేటి నాగార్జునరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : జూలై 1వ తేదీ నుంచి మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. ప్రారంభ సమావేశం మంగపతిదేవిపేట గ్రామంలో ఏర్పాటు చేశామని ఇందుకు సంబంధించిన ఏర్పాట్ల గురించి ఆమె స్వయంగా వెళ్లి పరిశీలించి ప్రజాప్రతినిధులకు సిబ్బందికి సూచనలు అందించారు. వివిధ రకాల సేవలను ఉచితంగా సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రజలు జగనన్న సురక్ష సర్వీసులతో లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం కొయ్యలగూడెంలోని సచివాలయాలు,, మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో జగనన్న సురక్ష సర్వీస్ అంశాల గురించి అవగాహన కల్పించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

పోలవరం రూరల్ : కుట్టుశిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని, వారు నేర్చుకున్న వృత్తిని పదిమందికి నేర్పే విధంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం పునరావాస కాలనీలోని కొండ్రుకోట నిర్వాసిత మహిళలకు ఐటీడీఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో 30 కుట్టు మెషీన్లను గురువారం పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మహిళలకు ఐటీడీఎస్ ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ కేజీపీజీ బేసిన్ చెన్నై కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ సహకారంతో మహిళలకు 60 రోజులు కుట్టుశిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు. శిక్షణ పొందిన మహిళలకు 30 కుట్టుమిషన్‌లను ఐటీడీఎస్ సేవాసంస్థ డైరెక్టర్ జి.అనిల్ కుమార్, ఓఎన్‌జీసీ బేసిన్ మేనేజర్ కె.కరవణన్, సీఎస్ఆర్ ఇన్‌ఛార్జ్ జయంతి లక్ష్మణ్ అందజేశారు. ఏజెన్సీ గ్రామాల మహిళలకు సహకారం అందిస్తున్న ఓఎన్‌జీసీ, ఐటీడీఎస్ సిబ్బందిని అభినందించారు. అనంతరం ఐటీడీఎస్ ఆధ్వర్యంలో పలువురిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ బేసిన్ మేనేజర్ కె.కరవణన్ , సర్పంచ్ పైడా నాగరాజు, ఎంపీటీసీ మాడే ఆనంద్, సీఎస్ఆర్ మాజీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సిలోమాన్ తదితరులు పాల్గొన్నారు.



కొండ్రుకోట పునరావాస కేంద్రంలో మహిళలకు కుట్టుమెషీన్లు అందజేస్తున్న దృశ్యం

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

కుక్కునూరు : సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను బుధవారం రైతు భరోసా కేంద్రంలో ఏఓ బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. బీపీటీ-5204, ఎంటీయూ-1061, 1064, 7024 అనే నాలుగు విత్తన రకాలను పొజిషన్ చేసినట్టు చెప్పారు. రైతులు కేవలం పదిశాతం చెల్లించి విత్తనాలు పొందవచ్చన్నారు. గరిష్టంగా ఒక్కో రైతుకు 5 బస్తాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దాచారం ఎంపీటీసీ సొడే సాధు, వింజరం సర్పంచ్ జగిడి బాలరాజు, మాధవరం సర్పంచ్ సత్యనారయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కుచ్చర్లపాటి నరసింహరాజు, రావు వినోద్, నకిరికంటి నర్సింహారావు, రాయి సత్యనారాయణ, మల్లేలా చంటినాయుడు, పగిళ్ల అల్లేష్, సూర్ల రాము తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు

అక్కమ్మ కోనేరు రజక చెరువును కాపాడాలి

జంగారెడ్డిగూడెం : అక్కమ్మ కోనేరును కాపాడాలని, కమ్యూనిటీ భవనం అభివృద్ధి చేయాలని కోరుతూ రజక సంఘం నాయకులు జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ పి.భవానీ ప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. తొలుత అక్కమ్మ కోనేరు వద్ద పట్టణ రజక సంఘం అధ్యక్షులు చాటపర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రజకుల చెరువు, కమ్యూనిటీ భవనం అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని చైర్‌పర్సన్, కమిషనర్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు రజకుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గోదావరి జిల్లాల రజక సంఘం అధ్యక్షులు చాటపర్తి పోసిబాబు, కోనేటి చంటి, సంపంగి నాని, కసింకోట సతీష్, సూదివరపు నాని, కట్టుంగ సుబ్రహ్మణ్యం, మఠం రమణ, గోవాడ పోతురాజు, సంపంగి రమణ, చిలంతరాజుల వెంకటేశ్వర రావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

సాగుకు సిద్ధం..



దుక్కిదున్ని భూములను సాగుకు సన్నద్ధం చేస్తున్న దృశ్యం

కుక్కునూరు : ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు, దుక్కులు దున్ని విత్తనాలను వేసేందుకు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా ముంపు సేకరణ చేయకుండా సేద్యంలో ఉన్న భూమి దాదాపుగా 5 వేల ఎకరాల పైమాటే,. వర్షాలు పడుతుండడంతో రైతులు ఉత్సాహంగా సాగుకు సిద్ధమైన మరోపక్క వారిని వరద భయం వెంటాడుతుంది. గత ఏడాది ఇదే నెలలో దుక్కులు దున్ని విత్తనాలు వేసి సాగుకు సిద్ధమైన రైతులను గోదావరి వరద కోలుకోలేని దెబ్బ తీసింది. విత్తనాలు వేసిన తరువాత రెండు, మూడు సార్లు వరద ముంచెత్తడంతో పెట్టుబడి కోల్పోయిన రైతన్నలు నష్టాల పాలైయ్యారు. అయినా వ్యవసాయం తప్ప మరో పని ఎరుగని మండల రైతులు ఆలస్యమైనా సాగును కొనసాగించారు. దీంతో ఆ ప్రభావం దిగుబడిపై పడింది, సరైన సమయంలో సాగు చేయకపోవడం వలన దిగుబడి తగ్గి అనుకున్న లాభాలు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత రెండు, మూడేళ్లుగా వరద కారణంగా ఏటా పెట్టుబడి పెట్టడం నష్టపోవడం పరిపాటిగా మారిందని రైతులు వాపోతున్నారు. మరోపక్క ప్రభుత్వం 41.15 కాంటూర్ పరిధిలోని ముంపు నిర్వాసితులకు పరిహారం ఇచ్చి పునరావాస కాలనీలకు పంపుతామని చెబుతుండగా ఒకవేళ పరిహారం ఇచ్చి పునరావాస కాలనీలకు తరలిస్తే ప్రారంభించిన సాగు మధ్యలో అగమ్యగోచరంగా తయారైవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరద ముంపుతో నష్టం

గత ఏడాది 12 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. మొక్కలు ఎదిగే సమయంలో గోదావరి వరద ముంచెత్తింది. దీంతో 12 ఎకరాల్లో పంట మొత్తం ఎండిపోయింది. దీంతో ఎకరాకు రూ.20 వేలు చొప్పున రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

– ముత్యాల వెంకన్న , రైతు, కుక్కునూరు

ఎస్సీ, ఎస్టీ పీవోఏ కేసు నమోదు

టి.నరసాపురం : తనకు రావాల్సిన సొమ్ములు ఇవ్వకపోగా లైంగికంగా వేధించి, కులం పేరుతో దూషించారంటూ ఒక వ్యక్తిపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొర్రంపాలెం గ్రామం శ్రీనగర్ కాలనీకి చెందిన గూట్ల నాగమణి 2021 అక్టోబర్‌లో అదే గ్రామానికి చెందిన గొగ్గి పూర్వచంద్రరావుకు రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇటీవల నాగమణి కుమార్తె అనారోగ్యానికి గురికావడంతో, వైద్యఅవసరాల నిమిత్తం అప్పుగా ఇచ్చిన రూ. 3 లక్షలు తిరిగి ఇవ్వాలని పూర్ణచంద్రరావును అడిగింది. అయితే సొమ్ములు ఇవ్వకపోగా లైంగికంగా వేధిస్తున్నాడని, తన కోరిక తీర్చకపోతే చంపేస్తానని బెదిరిస్తూ కులం పేరుతో దూషించాడని నాగమణి ఫిర్యాదులో పేర్కొందన్నారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ పీవోఏ కేసు నమోదు చేశామని, కేసును పోలవరం డీఎస్పీ శ్రీనివాసులు విచారణ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కోలా నాగార్జున వడ్రంగి పనిచేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం పని నిమిత్తం తన మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, పట్టణంలోని మండవల్లి పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొంది. ఈ ఘటనలో నాగార్జున తీవ్రంగా గాయపడగా, అతన్ని స్థానికులు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, నాగార్జున ఫిర్యాదుతో మోటార్‌సైక్లిస్ట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అవినీతిపై విచారణ జరపాలి

చింతలపూడి: రెవెన్యూ కార్యాలయంలో పెరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ అసెంబ్లీ మాజీ కన్వీనర్ తుల్లిమెల్లి కుటుంబరావు తెలిపారు. గతంలో మండలంలో పని చేసిన తహసీల్దార్లతో సహా నేటి వరకు అసైన్డ్ భూముల మ్యూటేషన్, 1 బి అడంగల్ కరక్షన్ పేరిట అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. గ్రామాల్లో కొందరు మధ్యవర్తులను పెట్టుకుని ఆన్‌లైన్లో మ్యూటేషన్‌లు చేస్తూ లక్షలాది రూపాయల ముడుపులు దండుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసైన్డ్ చట్టానికి తూట్లు పొడుస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

టి.నరసాపురం : ఎటువంటి అనుమతులు లేకుండా మల్లప్పగూడెంకు చెందిన పొట్ట వెంకన్న ఎర్రకాలువలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా ఏపుగుంట గ్రామ శివారులో బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.